క్లుప్తంగా

పోషకాహారం, మెరుగైన విద్యనందించేందుకు కృషి

ఉంగుటూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, ఫ్రీ స్కూల్‌లో మెరుగైన విద్యను అందించడానికి కృషి చేయాలని ఎంఈఓ - 2 సాంబశివరావు అన్నారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో మూడు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న పోషణ్ బీ పఢా యిబీ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. వైకల్యం సాధారణమని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మా దేవీ, దుర్గాదేవీ, హెచ్‌ఎం అనిత పాల్గొన్నారు.

నాడీ శోధనతో ఆరోగ్య సమస్యల నిర్ధారణ



పెనమలూరు: యోగా శక్తి చికిత్స ద్వారా నాడీ శోధనతో ఆరోగ్య సమస్యలు నిర్ధారణ చేయవచ్చని యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. కానూరు అశోక్‌నగర్‌లో శనివారం వివరాలు తెలుపుతూ నాడీ శోధన ద్వారా ప్రాణశక్తి స్థాయిని గుర్తించవచ్చన్నారు. రాబోయే ఆరోగ్య సమస్యలు తెలుపుకొని పూర్ణ ఆయుష్షు కలిగేలా ప్రాణశక్తి పెరిగేలా నాడీ శోధన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అశోక్‌నగర్ తన కార్యాలయం వద్ద నాడీ శోధన ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90003 47369 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



గన్నవరం: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు గన్నవరం పట్టణంలో శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో లక్ష్మణరావుకు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలుసుకుని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నేతలు ఉదయ్‌భాస్కర్‌రావు మాట్లాడుతూ.. అందరి సమస్యలను ప్రశ్నించే గొంతుక అయిన లక్ష్మణరావుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజల పక్షాన నిలిచే ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందన్నారు. సంఘం నేతలు సూరగాని సాంబశివరావు, మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎంయూ రిలే దీక్షలు



ఉయ్యూరు: ఉయ్యూరు డిపోలో ఎన్‌ఎంయూ చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజైన శనివారం కొనసాగాయి. దీక్షా శిబిరాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చార్జ్ కౌన్సెలింగ్‌పై డీఎం ప్రసాద్ పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్యాలయ ఉత్తర్వులు ప్రకారమే నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు రాజేష్‌కుమార్, సుబ్బారావు, డీకే రావు, డీఎం కృష్ణ, కేఎస్ రావు పాల్గొన్నారు.

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, కానుమోలు, శేరినరసన్నపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై శనివారం అవగాహన సదస్సులను నిర్వహించారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందటం వల్ల కలిగే ప్రయోజనాలను ఏఓ భవాని వివరించారు. పీఎం కిసాన్, ప్రభుత్వ పెట్టుబడి సాయం, పంటల బీమా, సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పంట రుణాలు పొందేందుకు కచ్చితంగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరమని చెప్పారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

- ప్రయాణికులకు ఉపయోగపడని షెల్టర్లు
- రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



నెప్పల్లి వద్ద ప్రయాణికుల జాడ లేని బస్‌షెల్టరు

కంకిపాడు: ప్రయాణికుల ఉపయోగార్థం నిర్మించిన బస్‌షెల్టర్లలో ప్రయాణికుల జాడే కనిపించటం లేదు. బస్సులు ఆగే స్థలం ఒక చోట, షెల్టర్లు నిర్మించిన ప్రదేశం మరొక చోట కావటంతో బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఇవి మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు కనీస పర్యవేక్షణ లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లు, గ్రామాల వద్ద ఉన్న పలు బస్ షెల్టర్లను విస్తరణలో భాగంగా తొలగించారు. దీంతో ఆయా గ్రామాల కూడళ్ల వద్ద బస్ షెల్టర్లు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ క్రమంలో జాతీయ రహదారి వెంబడి పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో పలు చోట్ల బస్ షెల్టర్లను నిర్మించారు.

అంతటా నిరుపయోగం..

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అనేక బస్ షెల్టర్లలో వేళ్ల మీద లెక్కించేవి మాత్రమే ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం వినియోగంలో ఉన్నాయి. మిగిలిన షెల్టర్లన్నీ నిరుపయోగంగానే ఉన్నాయి. గ్రామ కూడలి ఒక చోట ఉండటం, షెల్టర్లు నిర్మించిన ప్రదేశం ఆ కూడలికి దూరంగా ఉండటం ఒక కారణం. దీనికి తోడు బస్సులను సైతం కూడళ్లలో మాత్రమే నిలుపుతున్నారు. బస్ షెల్టర్లు ఉన్న ప్రాంతాల్లో నిలపటం లేదు. దీంతో క్రమేపీ బస్ షెల్టర్లు ప్రయాణికులకు దూరమయ్యాయి.

అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా..

ప్రయాణికులకు ఉపయుక్తం కావాల్సిన షెల్టర్లు రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. మద్యం సేవించే యువతకు, జూద క్రీడలకు, జంటలకు ఆవాసంగా తయారవుతున్నాయి. మద్యం తాగిన యువత అక్కడే మద్యం సీసాలను ధ్వంసం చేయటం, పరిసరాలను అధ్వానంగా మార్చటంతో పగటి వేళల్లో దూర ప్రయాణాలు సాగించే వాహనదారులు సైతం నిలబడలేని దుస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా పోలీసు అధికారులు, హైవే అధికారులు ఏ ఒక్కరూ వీటిపై పర్యవేక్షణ వహించటం లేదు. అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకునే చర్యలు తీసుకోకపోవటం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్‌లో శనివారం ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గుండె జబ్బులు, మెదడు, నరాలు, బీపీ, షుగర్, థైరాయిడ్, జీర్ణకోశ, కీళ్లు, ఊపిరితిత్తులు, స్త్రీ, ప్రసూతి, డెంటల్‌కు సంబంధించి 900 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్త పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో స్క్రీనింగ్, పీఎఫ్‌టీ కంటి పరీక్షలు వంటి ఆధునిక వైద్య సేవలందించారు. తొలుత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు శ్రీమల్లికార్జున, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ యాజమాన్యాలను ఆయన అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ గన్నవరం శాఖ అధ్యక్షురాలు చిన్ని మాధవీ, రోటరీక్లబ్ గన్నవరం శాఖ అధ్యక్షులు టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, శ్రీమల్లికార్జున సంస్థల డైరెక్టర్ నక్కిన చినవెంకట్రాయుడు, ప్రిన్సిపాల్ డి.మాధవీలత, ఆస్టర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గిరిబాబు, పి.వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో ఓ వ్యక్తి ఇంటిపై దాడి చేసిన పలువురిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తమ్ము జేమ్స్‌వర్మ కానూరు సనత్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. జేమ్స్‌వర్మకు బి.సాయికి గతంలో గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాయి, సురేష్, చరణ్, నవీన్, నాని మరి కొందరు శుక్రవారం జేమ్స్‌వర్మ ఇంటి వద్దకు కారులో వచ్చి మద్యం సేవిస్తూ చంపుతామని బెదిరించి ఇంటిపై దాడి చేసి అక్కడే ఉన్న బైక్‌ను ధ్వంసం చేశారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

చదువుతో పాటు మానసికోల్లాసం అవసరం



నున్న(విజయవాడరూరల్): విద్యార్థులకు చదువుతో పాటు మానసికోల్లాసం కల్గించే సాంస్కృతిక కార్యక్రమాలు అవసరమని డాక్టర్ భీమవరపు అనిత అన్నారు. నున్నలోని రవీంద్ర భారతి హైస్కూల్‌లో కాన్వకేషన్ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనిత మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యను సులభంగా అలవర్చుకునే పద్ధతుల్లో విద్యాభ్యాసం చేయించడంతో మానసిక ఒత్తిడి లేకుండా చూడాలని సూచించారు. విద్యార్థి దశలోనే పట్టుదలతో కూడిన విద్య, సామాజిక బాధ్యతలను నేర్పించాలన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. స్కూల్ చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, జోనల్ ఇన్‌చార్జి రమేష్, ప్రిన్సిపాల్, ఏఓ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై మాజీ సీఎం పేరు తొలగింపు

ఉయ్యూరురూరల్: రాజకీయ ముసుగులో కొందరు దుండగులు పెట్రేగిపోతున్నారు. గౌరవప్రదంగా ఏర్పాటుచేసిన విగ్రహాలను, శిలాఫలకాలను ధ్వంసం చేయటం దినచర్యగా చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆజాదీకా అమృత్ మహోత్సవం పేరుతో సచివాలయ స్థాయిలో నా భూమి - నా దేశం పేరుతో కార్యక్రమాలు నిర్వహించింది. పీఎం సందేశంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశం, జాతి కోసం పోరాడిన అమరుల పేర్లతో శిలాఫలకాలను ఏర్పాటుచేశారు. దీనిలో భాగంగా ఉయ్యూరు మండలం చిన ఓగిరాల సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును రాజకీయ కక్షతో కొందరు వ్యక్తులు తొలగించారు. నిత్యం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగం గుర్తించకపోవటం, దుండగులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం అధికారుల నిర్లక్ష్యానికి దర్పణం పడుతుంది. దుశ్చర్యకు పాల్పడ్డ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, శిలాఫలకాలకు, జాతి నేతల విగ్రహాలకు రక్షణ కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నా భూమి - నా దేశం శిలాఫలకంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెక్కివేసిన దృశ్యం

స్కూల్ బస్సు డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గన్నవరం: స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్ల ఆరోగ్యంపై యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.పద్మాకర్ సూచించారు. స్థానిక విమానాశ్రయం ఎదురుగా ఉన్న రవాణా శాఖ వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో గత నెల రోజులుగా జరుగుతున్న రహదారి భద్రత మాసోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. డీటీసీ ఏ.మోహన్ ఆదేశాల మేరకు ఎంవీఐ పద్మాకర్ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపింగ్, బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న 25 మంది స్కూల్ బస్ డ్రైవర్లకు ఉచితంగా పరీక్ష రిపోర్టులు, హెల్త్‌కార్డులను అందజేశారు. వలంట్రీ హెల్త్, ఎడ్యుకేషన్ అండ్ ఎకానమిక్ డెవలప్‌మెంట్ యూనిట్ డైరెక్టర్ ఎం.వాసు మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా ప్రతి ఏటా రోడ్డు ప్రమాదాల్లో 1.70 లక్షల మంది మృతి చెందుతున్నారన్నారు. ఈ ప్రమాదాలు కేవలం మానవ తప్పిదాలు, నిర్లక్ష్యం కారణంగానే జరుగుతున్నాయని చెప్పారు. ఉచితంగా హెల్త్‌కార్డులు పంపిణీ చేసిన ఎంవీఐ పద్మాకర్‌కు స్కూల్ యాజమాన్యాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఎంవీఐలు వై.నాగేశ్వరరావు, జీవీఎస్ఎస్ మూర్తి, డీవీ రమణ, శివరాంగౌడ్, ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైవర్‌కు హెల్త్‌కార్డు అందజేస్తున్న ఎంవీఐలు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెనమలూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతంగా జీవించగలుగుతామని పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రాజా అన్నారు. పెనమలూరు పీహెచ్‌సీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మయ్య, పీహెచ్‌ఎన్ లక్ష్మి, హెచ్‌వీ నిర్మల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేశారు.



పెనమలూరు పీహెచ్‌సీలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

చెత్త సేకరణ సమర్థవంతంగా జరగాలి

కంకిపాడు: చెత్త సేకరణ కార్యక్రమం సమర్థవంతంగా జరగాలని మండల ప్రత్యేకాధికారి జి.విజయలక్ష్మి సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పలూరు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ పి.అనూషతో కలిసి అధికారుల బృందం పరిశీలించింది. విజయలక్ష్మి మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త సేకరణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాటి సీతమ్మ నివాసంలో తయారు చేసుకుంటున్న హోం కంపోస్టు పిట్‌ను సందర్శించి ప్రోత్సహించారు. పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కాటూరులో అవగాహనా ర్యాలీ

ఉయ్యూరురూరల్: తడి, పొడి చెత్త, ఇతర ప్రమాదకర వ్యర్థాలను తొలగించటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని కాటూరులో శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ పాల్గొని పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యర్థాలను విభజించి పారిశుద్ధ్య కార్మికులకు అందించేలా ఇళ్ల యజమానులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఉత్తమ స్వచ్ఛ కృష్ణ చాంపియన్‌గా కాటూరు గ్రామం ఎంపిక కావటం అభినందనీయమన్నారు. అవార్డుకు ఎంపికైన పంచాయతీ కార్యదర్శి పీవీ సుబ్బారావును సత్కరించారు. ఎంపీడీఓ శేషగిరిరావు, ఈఓఆర్‌డీ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

గన్నవరం: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని గన్నవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఉంగుటూరు: తడి, పొడి చెత్త పంచాయతీ బండిలో వేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాష్‌నాథ్ కోరారు. మానికొండలో చెత్త సేకరణపై క్లాప్ మిత్రాలకు శనివారం పలు సూచనలు చేశారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్తపై పంచాయతీ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు.

చెత్తను వేరు చేసి ఇవ్వాలి

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం, అల్లాపురం గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి డి.విజయవర్ధనరావు, ఎంపీడీఓ టి.స్వర్ణలత ఆయా గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. ఇంకుడు గుంతల ఏర్పాటు పనులను పర్యవేక్షించిన అధికారులు సిబ్బందికి సూచనలు, పలహాలు ఇచ్చారు. ఈఓపీఆర్డీ టి.భారతి, ఉపాధి హామీ ఏపీఓ సత్యప్రియ, పంచాయతీ కార్యదర్శులు సరోజిని, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను విధిగా పాటించాలని మండల ప్రత్యేక అధికారి కె.శంకరరావు అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ పారిశుద్ధ్యం పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. అనంతరం బాపులపాడు డంపింగ్ యార్డును ఆయన సందర్శించారు. అక్కడి ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించి, సూచనలు చేశారు. ఎంపీడీఓ జోగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి పాల్గొన్నారు.

ఇంటి వద్దే వ్యర్థాలను వేరు చేయండి

నున్న(విజయవాడరూరల్): ప్రజలు ఇంటి వద్దే తడి, పొడి చెత్త, హానికరమైన వ్యర్థాలను బుట్టల్లో అందజేయాలని నున్న గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు అన్నారు. మూడో శనివారం నున్న గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వైద్య, సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఆర్.లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పాతపాడు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పి.కోటిలింగమ్మ సచివాలయం సిబ్బందితో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. పి.నైనవరం గ్రామంలో గ్రేడ్ - 5 కార్యదర్శి సంతోష్, సిబ్బందితో ర్యాలీగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు.

క్లస్టర్ సమావేశాలకు విధిగా హాజరుకావాలి



నున్న జెడ్పీ హైస్కూల్‌లో సమావేశానికి హాజరైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

నున్న(విజయవాడరూరల్): విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా జరిగే క్లస్టర్ సమావేశాలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విధిగా హాజరుకావాలని రాష్ట్ర పరిశీలకులు ప్రతీక్ భర్న అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం హైస్కూల్స్, ఎలిమెంటరీ స్కూల్స్‌కు సెలవు ఉంటుందని, ఆ సమయంలో క్లస్టర్ సెంటర్‌లో సమావేశాలను నిర్వహించి సబ్జెక్ట్ వారీగా రివ్యూ జరుగుతుందన్నారు. విద్యార్థులు సబ్జెక్ట్ వారీగా ప్రతిభను కనబర్చేందుకు క్లస్టర్ సమావేశాలు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సమావేశాలు నిర్వహిస్తోందన్నారు. ఎలిమెంటరీ విద్యార్థులకు 1,2,3 తరగతులకు ప్రత్యేకంగా, 4,5, తరగతుల ఉపాధ్యాయులతో రివ్యూ, హైస్కూల్ విద్యార్థులకు సబ్జెక్ట్ వారీగా రివ్యూ జరుగుతుందని చెప్పారు. బోధన పద్ధతులు మెరుగు పర్చడానికి షెడ్యూల్ లింక్ ఐ.ఎఫ్.వి ప్యానెల్‌లో వీక్షించే ఏర్పాటు చేశారు. సమావేశంలో మరో రాష్ట్ర పరిశీలకులు యజ్ఞ రాజపోలు క్లస్టర్ సమావేశాల ప్రాధాన్యతను వివరించారు. సిలబస్ పూర్తి చేయడం, సి.డి. గ్రేడ్ విద్యార్థుల ప్రోగ్రెస్ గురించి చర్చించారు. నున్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైస్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ రవి ప్రసాద్, 45 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రైమరీ లెవెల్ రీసోర్స్ పర్సన్స్‌గా పి.మనోజ, వి.రత్న కుమారి వ్యవహరించారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

పెనమలూరు: కానూరు పంట కాలువ రోడ్డులో ఎమ్మెల్యే సుజనాచౌదరి ఇంటి వద్ద ఉన్న ఫ్లెక్సీలను తాడిగడప మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు చేయకపోవటంపై సాక్షి దినపత్రికలో శనివారం 'ఎమ్మెల్యేకు ఎన్నికల కోడ్ అమలేదీ' వార్త ప్రచురించటంతో అధికారులు వెంటనే స్పందించారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి దాదాపు రెండు వారాలు కావొస్తున్నా తాడిగడప మున్సిపాలిటీ అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేయలేదు. కానూరు పంటకాలువ రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే సుజనాచౌదరి ఇంటి వద్ద ఉన్న ఫ్లెక్సీలు తొలగించలేదు. సాక్షి దినపత్రికలో కథనం రావటంతో శనివారం ఫ్లెక్సీలు తొలగించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన తాడిగడప మున్సిపాలిటీ అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందా లేదా వేచి చూడాల్సి ఉంది.



సుజనాచౌదరి ఇంటి వద్ద తొలగించిన ఫ్లెక్సీలు

తాడిగడపలో అక్రమ కట్టడం కూల్చివేత

పెనమలూరు: తాడిగడప గ్రామంలో జనసేన నేత అక్రమంగా నిర్మాణం చేస్తున్న భవనాన్ని తాడిగడప మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చారు. తాడిగడప, యనమలకుదురులో కుప్పలుతెప్పలుగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. అయితే టౌన్ ప్లానింగ్ అధికారులు జనసేన నేత నిర్మిస్తున్న అక్రమ కట్టడంపై కన్నేశారు. సిబ్బందితో వచ్చి అక్రమ కట్టడం కొంత మేరకు కూల్చారు.

హైడ్రామా..

గ్రామంలో అనేక అక్రమ కట్టడాలు ఉండగా జనసేన నేతను టార్గెట్ చేసి టౌన్‌ప్లానింగ్ అధికారులు భవనం కూల్చడటంతో టీడీపీ, జనసేనలో లుకలుకలు బయటపడ్డాయి. గత కొద్దికాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న ఇరు పార్టీల నేతల కలయికలో విబేధాలు బయటపడుతున్నాయి. భవనం నిర్మాణాలు కూల్చకుండా అడ్డుకోవటానికి జనసేన నేతలు హడావుడి చేయటంతో హైడ్రామా చోటు చేసుకుంది. అయితే అధికారులు ఫోన్లు స్విచ్ఛాఫ్‌లు చేసి భవనం శ్లాబ్‌కు రంధ్రాలు పెట్టారు. సకాలంలో పేమెంట్ అందకపోవటంతో కావాలనే అధికారులు ఈ చర్యలకు పాల్పడ్డారని పలువురు బిల్డర్లు అభిప్రాయపడుతున్నారు.



తాడిగడపలో అక్రమ కట్టడం కూల్చి వేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

గ్రిగ్ మెమోరియల్‌లో ఈడుపుగల్లు జెడ్పీ విద్యార్థుల సత్తా

కంకిపాడు: గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీల్లో ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల క్రీడాకారులు తమ సత్తా చాటారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం బి.పద్మావతి భాయ్ శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 12న కృష్ణాజిల్లా 84వ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలు నిర్వహించారన్నారు. బాలికల విభాగంలో వి.దీప్తి 100 మీటర్లు, 200 మీటర్లలో ప్రథమస్థానం, ట్రిపుల్ జంప్‌లో రెండో స్థానం, లాంగ్ జంప్, రిలేలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. పి.దుర్గాభవాని 400 మీటర్లు, 200 మీటర్లు పరుగు, రిలేలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. సీహెచ్ గాయత్రి లాంగ్ జంప్‌లో ప్రథమస్థానం, 100 మీటర్లు, 200 మీటర్లు పరుగులో రెండో స్థానం, రిలేలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. వి.దివ్యహాసిని 600 మీటర్ల పరుగులో రెండో స్థానం, రిలేలో మొదటి స్థానం దక్కించుకుందన్నారు. ఎస్.జీవన రిలేలో మూడో స్థానం, ఏ.లాస్య రిలేలో మొదటి స్థానం, ఆర్.భారతి రేస్ వాక్‌లో రెండో స్థానం, కె.దేవీశ్రీసాయిదీప్తి 400 మీటర్ల పరుగులో మొదటి స్థానాన్ని, మూడు కిలో మీటర్ల పరుగులో మూడో స్థానం, రిలేలో మూడో స్థానంలో, అశ్విని రిలేలో మూడో స్థానంలో నిలిచారన్నారు. బాలుర విభాగంలో ఇటీవల గోగినేనివారిపాలెంలో జరిగిన ఆటల పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో పి.బాబు రిలే, 400 మీటర్ల పరుగులో రెండో స్థానాన్ని, శ్రీహర్ష 400 మీటర్లు 600 మీటర్ల పరుగులో మూడో స్థానంలో, రిలేలో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడన్నారు. తన్వీర్ రిలేలో రెండో స్థానం, కె.ధనుష్ షాట్‌పుట్‌లో మొదటి స్థానం, రిలేలో రెండో స్థానంలో నిలిచాడన్నారు. పి.రామ్‌నాయుడు 200 మీటర్లు పరుగులో రెండో స్థానం, 400 మీటర్ల పరుగులో మూడో స్థానం దక్కించుకున్నారన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గాభవాని, రామయ్యలను అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం పద్మావతి భాయ్

పాతపాడు మహిళా పోలీస్‌కు ప్రశంసా పత్రం

పాతపాడు(విజయవాడరూరల్): రహదారులపై వాహనదారుల భద్రత విషయంలో అవగాహన కల్పించిన పాతపాడు గ్రామ సచివాలయం మహిళా పోలీస్ ఎం.సజినిరాణికి ప్రశంసా పత్రం లభించింది. గత నెల రోజులుగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ వినియోగం ఆవశ్యకతపై వివిధ రూపాల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులలో చైతన్యం పెరిగేందుకు కృషి చేసినందుకు ప్రభుత్వం అవార్డును ప్రకటించింది. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం విజయవాడలోని ఎన్జీఓ హోంలో శనివారం జరిగింది. కార్యక్రమంలో డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మోహన్ చేతుల మీదుగా సజినిరాణి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.



డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మోహన్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సజినిరాణి